క్లుప్తంగా

ఫసల్‌బీమా యోజన పథకం గడువు పెంపు

మద్దిపూడి: ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజన పథకం గడువును ఈ నెల 14 వరకు పొడిగించినట్లు వ్యవసాయాధికారి సీహెచ్ వెంకటేష్ తెలిపారు. మండలంలోని కూచిపూడి, జువ్విగుంట గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో మంగళవారం ఆయన రైతులతో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకాన్ని రైతులంతా ఉపయోగించుకోవాలన్నారు. కోటేశ్వరరావు, యశ్వంత్ రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

హనుమంతునిపాడు: స్థానిక ఏరువవారి నిమ్మతోట సమీపంలో కంభం కనిగిరి రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మంగళవారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. వెలిగండ్ల మండలం ముసిలిపల్లి గ్రామానికి చెందిన ఆలా నరసింహం నీలకంఠాపురం గ్రామం బంధువుల వద్దకు వచ్చి సోమవారం పొద్దుపోయిన తరువాత ద్విచక్ర వాహనంపై కనిగిరి వైపు వస్తున్నాడు. ఆ సమయంలో ఏరువవారితోట సమీపంలో ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో బైక్‌పై వెళుతున్న క్షతగాత్రుడు ఆలా నరసింహంకు తలకు తీవ్ర గాయాలయ్యాయి. రోడ్డుపై పడి ఉన్న వ్యక్తిని తెల్లవారుజామున బీట్ కానిస్టేబుల్ గమనించి 108 వాహనంలో కనిగిరి తరలించారు. తలకు బలమైన గాయం కావడంతో కోమాలోకి వెళ్లాడు. కనిగిరిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం ఒంగోలుకు తరలించారు.

నూరుశాతం రికవరీ చేయాలి



వీఓఏలకు విత్తన ప్యాకెట్లు అందజేస్తున్న ఏపీఎం, సీసీ

సీఎస్‌పురం(పామూరు): స్త్రీనిధి, ఉన్నతి రికవరీలు నూరుశాతం ఉండేలా వీఓఏలు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఏపీఎం లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం మండలంలోని వీఓఏలకు రికార్డుల నిర్వహణ, ఆరోగ్యం, పౌష్టికాహారంపై వివరించారు. కొరమేను చేపల పెంపకం చేపట్టే లబ్ధిదారులను గుర్తించి పీఎంఈజీపీ ద్వారా 35 శాతం రాయితీతో గ్రౌండింగ్ చేస్తామన్నారు. ఈసందర్భంగా హైగ్రో కంపెనీవారు సమకూర్చిన కాయకూరల విత్తనాలను ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు అందజేశారు. హరి, టాటా ట్రస్ట్ ప్రోగ్రామ్ అసోసియేట్ డి.గోపి, సీసీలు టి.కాశయ్య, మస్తాన్‌రెడ్డి, నారాయణమ్మ, మండల సమాఖ్య అధ్యక్షురాలు సుబ్బమ్మ, సువార్తమ్మ, వీఓఏలు హాజరయ్యారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓలు

సీఎస్‌పురం(పామూరు): ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని ఎంఈఓలు జె.ప్రసాదరావు, రాజాల కొండారెడ్డి అన్నారు. సీఎస్‌పురం ఎస్టీకాలనీ ఎంపీపీఎస్ పాఠశాలలో రిటైర్డ్ అయిన, బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు ఎస్.వెంకటరామిరెడ్డి, పి.మాలకొండయ్య, పఠాన్ మహ్మద్‌రఫిలను మంగళవారం పాఠశాల హెచ్ఎం ఎల్.ఆంథోని అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సన్మానించారు. సీఎస్‌పురం జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం షేక్.ఖాదరున్నీసాబేగం, పాఠశాల ఎస్ఎంసీ సురేష్, పాఠశాల ఉపాధ్యాయులు తోట శ్రీనివాసులు, షకీలాబేగం, డి.పున్నమ్మ, పి.అరుణ, సీహెచ్.సునీతాదేవి, బేగం తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలి

హనుమంతునిపాడు: ఆరోగ్య సబ్ సెంటర్ల పరిధిలో ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాలు, ఏఎన్ఎంలు ప్రజలకు అందుబాటులో ఉండాలని మెడికల్ ఆఫీసర్ దార్ల సందీప్ అన్నారు. స్థానిక పీహెచ్‌సీ సెంటర్‌లో మంగళవారం వైద్య సిబ్బందికి, ఆశావర్కర్లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెంగీ, మలేరియా, టైఫాయిడ్, విష జ్వరాలు సోకకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్యసేవలు అందిందాచాలన్నారు. నెలవారి రిపోర్టులు సకాలంలో అందించాలన్నారు. ఆశాలు ఏఎన్ఎంలకు గ్రామాలో అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ కేవీ చెన్నయ్య, సూపర్‌వైజర్లు బాలు, పద్మావతి, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

వెలిగండ్ల సీడీపీఓగా ఆశా బేగం



ఎస్కే ఆశా బేగం

వెలిగండ్ల(కనిగిరిరూరల్): వెలిగండ్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓగా ఎస్కే ఆశా బేగం బాధ్యతలు స్వీకరించారు. ఈమె నాయుడు పేట గ్రేడ్ 1 సూపర్‌వైజర్‌గా పనిచేశారు. పలు ప్రాజెక్టుల్లో ఇన్‌చార్జి సీడీపీఓగా కూడా పనిచేశారు. పదోన్నతిపై రెగ్యులర్ సీడీపీఓగా నియోజకవర్గంలోని వెలిగండ్ల ప్రాజెక్టు సీడీపీఓగా నియమితులయ్యారు.



పెదపవనిలో నిరుపయోగంగా ఉన్న సంపద తయారీ కేంద్రం



ఖాళీగా ఉన్న నాడెప్ తొట్లు

సంపద లేని కేంద్రాలు !

చెత్త రాదు.. ఎరువు తయారు కాదు

- నిరుపయోగంగా చెత్త నుంచి సంపద కేంద్రాలు
- కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ

లింగసముద్రం:

గ్రామాల్లో చెత్తాచెదారాన్ని సేకరించి స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు చెత్త నుంచి సంపద వచ్చేలా సంపద కేంద్రాలు ఏర్పాటు చేశారు. ముఖ్యంగా గ్రామ పంచాయతీలకు ప్రధాన వనరుగా సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సిస్టం ఉపయోగపడుతుందన్న లక్ష్యంతో ప్రతీ గ్రామ పంచాయతీ కేంద్రంలో ఈ షెడ్డును నిర్మించారు. గత ప్రభుత్వ పాలన సమయంలో రూ.లక్షల వ్యయంతో నిర్మించిన చెత్తనుంచి సంపద కేంద్రాలు నేడు పట్టించుకునే నాథుడే లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి.

చాలా చోట్ల నిరుపయోగంగా..

నియోజకవర్గ వ్యాప్తంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో చాలా వరకు నిరుపయోగంగా ఉన్నాయి. కూటమి ప్రభుత్వంలో అధికారుల నిర్వహణా లోపం, ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడడంతో వీటిని ఎవరూ పట్టించుకోవడం లేదు. మండల కేంద్రమైన లింగసముద్రంలో గతంలో తాటాకులతో షెడ్డును నిర్మించారు. తాటాకులు శిథిలం కావడంతో సంపద కేంద్రం శిథిలంగా మారింది. అన్నెబోయినపల్లె గ్రామంలో పిల్లర్లు మాత్రమే నిర్మించి షెడ్డు వేయడం అధికారులు మరిచారు. తడి, పొడి చెత్త సేకరణకు సరైన సిబ్బందిని కూడా కేటాయించకపోవడంతో సంపద కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. మండలంలో 16 గ్రామ పంచాయితీలు ఉండగా వీటిని 13 గ్రామ సచివాలయాలుగా గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో చెత్త నుంచి సంపద తయారీ చేయడానికి రూ.లక్షల వ్యయంతో షెడ్లను, నాడెప్ తొట్లను ఏర్పాటు చేశారు. అయితే వీటిలో కొన్ని కేంద్రాల్లో మాత్రమే వినియోగంలోకి తీసుకురాగా మిగిలినవి నిరుపయోగంగా మారాయి. ఆయా గ్రామ పంచాయతీల్లో చెత్త సేకరణలో సిబ్బంది కొరత కూడా ఉన్నట్లు తెలుస్తుంది. కూటమి ప్రభుత్వం గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలపై మాత్రం దృష్టి పెట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఆయా పంచాయతీల పరిధిలో అవసరమైన మేరకు గ్రీన్ అంబాసిడర్లను ఏర్పాటు చేసి సంపద కేంద్రాల నిర్వహణకు కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.



అన్నెబోయినపల్లెలో పిల్లర్లు నిర్మించి షెడ్డు ఏర్పాటు చేయని అధికారులు

పంచాయతీల్లో ఆదాయం లేదు..



గత ఆరు నెలలుగా పంచాయతీలకు రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు రావడం లేదు. దీనితో గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు అనేక అవస్థలు పడుతున్నాం. కనీసం బ్లీచింగ్ పౌడర్ కూడా చల్లలేని పరిస్థితుల్లో ఉన్నాం. గ్రీన్ అంబాసిడర్లు నెలకు రూ.15 వేలు అడుగుతున్నారు. ఈ పరిస్థితుల్లో సిబ్బంది కొరతతో అనేక ఇబ్బందులు పడుతున్నాం

– దబ్బుగొట్టు మల్లికార్జున సర్పంచ్, ఎర్రారెడ్డిపాలెం, లింగసముద్రం మండలం

ఇబ్బందులు తలెత్తుతున్నాయి..



గ్రామ పంచాయతీలకు నిధులు సక్రమంగా రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. గ్రామంలో పారిశుద్ధ్య పనులు కూడా చేపట్టలేక పోతున్నాం. అధికారులు కూడా మాట వినే పరిస్థితుల్లో లేరు. గ్రీన్ అంబాసిడర్లను ఏర్పాటు చేయకపోవడంతో ఎక్కడి చెత్త అక్కడే నిల్వ ఉంటుంది చెత్త సంపద కేంద్రాలకు తరలించడం లేదు. గ్రామాల అభివృద్ధి కుంటు పడుతుంది. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేసి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి.

– దేగా వెంకటేశ్వర్లు సర్పంచ్, అయ్యవారిపల్లె, వలేటివారిపాలెం మండలం

స్మార్ట్ మీటర్లు ఉపసంహరించకుంటే గుణపాఠం



కనిగిరిలో మాట్లాడుతున్న సీపీఐ మండల కార్యదర్శి జీపీ రామారావు



ధర్నాలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా నాయకుడు హనీఫ్

పామూరు: ప్రభుత్వం నివాసగృహాలకు స్మార్ట్ మీటర్లను ఏర్పాటుచేయడాన్ని ఉపసంహరించుకోకపోతే తగిన గుణపాఠం చెబుతామని సీపీఎం జిల్లా నాయకుడు సయ్యద్ హనీఫ్ అన్నారు. స్థానిక సుందరయ్యభవన్ సెంటర్‌లో మంగళవారం ఐక్యవేదిక ఆధ్వర్యంలో షేక్.ఖాదర్‌బాషా అధ్యక్షతన స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా హనీఫ్ మాట్లాడుతూ టీడీపీ ప్రతిపక్షంలో ఉన్న సందర్భంలో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించి నేడు అదానీకి అమ్ముడుపోయి స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు మొగ్గుచూపడం సిగ్గుచేటన్నారు. టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజలపై ట్రూఅప్ చార్జీల పేరుతో రూ.17 వేల కోట్ల భారం మోపిందన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని విద్యుత్ ఏఈ జిలానీకి అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి షేక్.ఖాదర్‌బాషా, కొమ్మలపాటి మాల్యాద్రి, అల్లాబక్షు, సయ్యద్ షమ్మి, మదారమ్మ, ఖాదరున్నీసా పలువురు పాల్గొన్నారు.

కనిగిరిరూరల్: విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపును ఉపసంహరించుకోవాలని కోరుతూ ప్రజా సంఘాల ఐక్య వేదిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో వేర్వేరుగా విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ పీసీ కేశవరావు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల వలన ప్రజలపై అదనపు భారం పడుతుందన్నారు. పి.నరేంద్ర, బి.ఆదిలక్ష్మి, ఎస్కే లాల్‌బీ, యు పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు. సీపీఐ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం విద్యుత్ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి జీపీ రామారావు, సీపీఐ సహాయ కార్యదర్శి గులాం హుస్సేన్, డీహెచ్ పీఎస్ జిల్లా కార్యదర్శి పందిటి మోహన్ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలను దోచుకునేందుకు కూటమి సర్కార్ పూనుకుందన్నారు. సీపీఐ, వివిధ ప్రజా సంఘాల నాయకులు ఎస్కే ఖాశింపీరా, గుజ్జుల బాలిరెడ్డి, మహిళా సమాఖ్య నాయకురాలు ఎస్కే బషీరా, కోటయ్య, అంకమ్మ, సయ్యద్ ఇఫ్రాజ్ పాల్గొన్నారు.

సీఎస్‌పురం(పామూరు): స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఐక్య వేదిక నాయకులు ధర్నా నిర్వహించారు. ధర్నాలో నాయకులు ఎస్ తిరుపతిరెడ్డి మాల్గొన్నారు. అనంతరం వినతిపత్రాలు అందజేశారు.

హాస్టల్‌ను తరలించడం మానుకోవాలి



ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన



ఆర్టీఓ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

- ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా

కనిగిరిరూరల్: బీసీ 2 హాస్టల్‌ను తరలించడం మానుకుని కనిగిరిలోనే కొనసాగించాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో వేర్వేరుగా ఆర్టీఓ కార్యాలయం వద్ద ధర్నా చేసి, అనంతరం అధికారులకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గ, రెవెన్యూ డివిజన్ కేంద్రంలో ఉన్న బీసీ 2 బాలుర హాస్టల్‌ను కుంటి సాకులతో వెలిగండ్ల మండలం ఇమ్మడి చెరువుకు తరలించే చర్యలు తీసుకోవడం సరైంది కాదన్నారు. హాస్టల్‌లో సుమారు 80 నుంచి 100 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నట్లు చెప్పారు. ప్రజాభిప్రాయం, తల్లిదండ్రుల అభిప్రాయం, విద్యార్థుల అభిప్రాయం తీసుకోకుండా అధికారులు పాలకులు ఏక పక్ష నిర్ణయం తీసుకోవడం సరైంది కాదన్నారు. వెలిగండ్లలో ఇప్పటికే ఎస్సీ, బీసీ హాస్టల్స్ ఉన్నాయన్నారు. నిజంగా ఇమ్మడిచెరువు గ్రామానికి హాస్టల్ అవసరమనుకుంటే పది మంది లోపు ఉన్న హాస్టళ్లను, మూతబడిన హాస్టళ్లను అక్కడి సర్దుబాటు చేసుకోవాలన్నారు. అధికారులు, పాలకులు అలాంటి ప్రయత్నం చేయకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు దీనిపై సమగ్రంగా చర్చించి విద్యార్థుల, తల్లిదండ్రుల అభిప్రాయాలను పరిగణలోనికి తీసుకోవాలన్నారు. లేకుంటే విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాన్ని తీవ్ర తరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు తాహీద్, ఇఫ్రాజ్, ముసాధిక్, శివ, కౌసిక్, కార్తీక్, మణికంఠ, పాండురంగారావు, వినోద్, హనుమంత, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థిని భయపెట్టి నామినేషన్ల ఉపసంహరణ

కొండపి: కొండపి పంచాయతీకి కాంగ్రెస్ మద్దతుతో ఉన్న వై సురేఖను అధికార బలంతో భయపెట్టి నామినేషన్ ఉపసంహరించేటట్లు చేయడం దుర్మార్గమని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీపతి సతీష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా అభ్యర్థిని బరిలో దించామని, కానీ అధికార పార్టీ నేతలు అందరినీ భయభ్రాంతుకు గురిచేసి ఏకగ్రీవం అయ్యేలా చేశారన్నారు. అన్ని రోజులు ఒకేలా ఉండవని, రానున్న రోజుల్లో ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు.

గిరిజనుల హక్కుల పరిరక్షణకు కృషి



అనంతవరంలో మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్ నాయక్

టంగుటూరు: గిరిజన హక్కుల పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ అన్నారు. టంగుటూరులో గిరిజన ప్రజా చైతన్య యాత్ర వాల్‌పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య వచ్చి 78ఏళ్లు దాటినా ఇప్పటికీ లక్షలాది మంది గిరిజనులకు కూడు గూడు లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. వారికి ఆధార్ కార్డు లేకపోవడంతో సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారన్నారు. హక్కుల సంరక్షణకు సంఘటితంగా కృషి చేయాలన్నారు. సమావేశంలో సంఘీభావం తెలిపి ప్రజా చైతన్య యాత్ర వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. పేరం సత్యం, గిరిజన ప్రజా సమాఖ్య ప్రకాశం జిల్లా అధ్యక్షుడు ఆర్ సైదా నాయక్, పొట్లూరి లక్ష్మయ్య, రాము నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రూ.35 వేల ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న సేవాసంస్థ ప్రతినిధులు

వెలిగండ్ల,(కనిగిరిరూరల్): మండలంలోని కంకణంపాడుకు చెందిన పేద బ్రహ్మణుడు బచ్చలి హిమనేష్ కృష్ణ కుమార్‌కు గుండె ఆపరేషన్‌కు ఉద్యోగ, ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ తాడిపత్రి శాఖ ఆధ్వర్యంలో రూ.35వేల ఆర్థిక సాయం అందచేశారు. ఈమేరకు మంగళవారం సేవా సంస్థ ప్రతినిధి వెంకట మోహన్ ద్వార హిమనేష్ కుటుంబానికి అందచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సేవా సంస్థ కన్వీనర్ శ్రీహరి, వర్కింగ్ ప్రెసిడెంట్ నారబోయిన శంకర్, ఉపాధ్యక్షుడు కుమారస్వామి, చంద్రశేఖర్, నాగభూషణరావు, శ్రీనివాసులు, ట్రెజరర్ రంగయ్య, సభ్యులు వెంకట మోహన్, వెంకటయ్య, పెద్దయ్య, ఉమా మహేశ్వరి, మదన్ మోహన్, తదితరులు పాల్గొన్నారు.

409 పొగాకు బేళ్లు తిరస్కరణ

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం నిర్వహించిన వేలంలో 409 బేళ్లను వ్యాపారులు తిరస్కరించారు. క్లస్టర్ పరిధిలోని దావగూడరు, చింతలపాలెం గ్రామాల రైతులు 831 బేళ్లనుతీసుకురాగా 422 బేళ్లను కొనుగోలు చేశార. గరిష్ట ధర రూ.281, కనిష్ట ధర రూ.159, సరాసరి ధర రూ.215.45గా నమోదైంది. వేలంలో 23 కంపెనీలు పాల్గొన్నాయి.



వైఎస్సార్ సీపీ కార్యాలయం సమీపంలో డ్రోన్



వైఎస్సార్ సీపీ కార్యాలయం ముందు పహారా కాస్తున్న పోలీసులు



మధ్యాహ్నం 3 గంటల తర్వాత సచివాలయం నుంచి బయటకు వస్తున్న టీడీపీ నేత

కొండపి పంచాయతీ ఎన్నికల వేళ కూటమి ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకొని దౌర్జన్య కాండకు తెరతీసింది. పోలీసులు అడుగడుగునా టీడీపీకి అనుకూలంగా వైఎస్సార్‌సీపీ సానుభూతి అభ్యర్థులను ఇబ్బందులకు గురిచేశారు.



రిటర్నింగ్ అధికారిని కలవనీయకపోవడంతో వెనుదిరిగిన మాజీ మంత్రి సురేష్

తల్లిపాలతో సంపూర్ణ ఆరోగ్యం



రావిగుంటపల్లెలో తల్లిపాల ఆవశ్యకతపై ర్యాలీ



పొన్నలూరులో తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

సీఎస్‌పురం(పామూరు): తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని సీడీపీఓ కె.కృపావరం అన్నారు. మండలంలోని మిట్టపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం జాతీయ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ కృపావరం మాట్లాడుతూ బిడ్డపుట్టిన వెంటనే తల్లిముర్రు పాలను బిడ్డకు విధిగా తాగించాలన్నారు. ముర్రుపాలలో వ్యాధి నిరోధకశక్తి అధికంగా ఉంటుందని, తద్వారా పుట్టినబిడ్డ చిన్నా చితక వ్యాధులకు దూరంగా ఉంటారన్నారు. తల్లి బిడ్డకు పాలు ఇచ్చే పద్ధతులను వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారాన్ని విధిగా గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లల తల్లులు తీసుకుని ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. సరళారెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

పామూరు: తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎంవీఎస్ పార్వతి, గోళ్ల పద్మజ అన్నారు. తల్లిపాల వారోత్సవాలను మండలంలోని రావిగుంటపల్లె, బొట్లగూడూరు, తూర్పు కట్టకిందపల్లె అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు.

పొన్నలూరు: తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యకరమని సీడీపీఓ బి సుశీల అన్నారు. స్థానిక ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ర్యాలీ నిర్వహించారు. నాలుగు అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీఓ సుశీల మాట్లాడుతూ తల్లులు తమ పిల్లలకు ముర్రుపాలు తాగించడం వల్ల చిన్నారుల్లో రోగ నిరోధక శక్తి పెరిగి ఆరోగ్యవంతంగా ఎదుగుతారన్నారు. ప్రసవించిన వెంటనే తల్లి మొదటి సారి ముర్రుపాలును శిశువుకు తాపాలన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పాలు, గుడ్లు, పౌష్టికాహారాన్ని తీసుకోని ఆరోగ్యంగా ఉండాలన్నారు. సూపర్‌వైజర్ విక్టోరియా, అంగన్‌వాడీ కార్యకర్తలు కె. అనురాధ, గౌసియా, మధురవాణి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నీట మునిగిన పంటలు



నీట మునిగిన గెనుసు పైరు.



వర్షం నీటిలో ఉన్న పశువుల మేత

మద్దిపూడి: మండలంలో రెండు రోజుల పాటు భారీ వర్షం కురిసింది. అయితే ఈ వర్షంనీరు పంట చేలల్లో మోకాలి లోతు వరకు నిలిచాయి. దీంతో పంటలు దెబ్బతిన్నాయి. గెనుసు, పశువుల మేత, సజ్జ వంటి పంటలు పూర్తిగా నీట మునిగాయి. మద్దిపూడి పంచాయతీ పరిధిలో గ్రీన్‌ఫీల్డ్ హైవే రహదారిని నిర్మిస్తున్నారు. మద్దిపూడి నుంచి గంగపాలెం గ్రామం వెళ్లేందుకు ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవే గుండా కాలిబాట ఉంది. గ్రీన్‌ఫీల్డ్ హైవే వద్ద నీళ్లు వెళ్లేందుకు బ్రిడ్జి నిర్మించకుండా గండి కట్ట వేయడంతో వర్షం నీరు పంట చేలల్లో నిలుస్తున్నాయని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం హైవే పక్కన దాదాపు 4 ఎకరల్లో సాగుచేసిన గెనుసుపంట, సజ్జ, పశువుల మేత కోసం సాగుచేసిన జొన్నపంట నీట మునిగాయని, నష్టపరిహారం ఇప్పించాలని బాధితులు బోన వెంకటనారాయణ, బోన రమణయ్య, బోన శ్రీనివాసులు కోరుతున్నారు.

గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన



వెలిగండ్లలో మాట్లాడుతున్న ఎస్సై కృష్ణ పావని

వెలిగండ్ల,(కనిగిరిరూరల్): గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎస్సై కృష్ణపావని అన్నారు. మండలంలోని పందువ నాగుల వరం జెడ్పీహెచ్ స్కూల్‌లో విద్యార్థులకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. డ్రగ్స్ నియంత్రణకు, బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలను నివారించేందుకు శక్తి టీం, శక్తి వారియర్స్‌ను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఎంఈఓల సంఘం జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి రామిరెడ్డి, హెచ్ఎం కె.అబ్రహం, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, ఈశ్వరమ్మ, మధుసూదన్‌రెడ్డి, తిమోతి, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: మండల పరిధిలోని హాజీపురంలో సైబర్ నేరాలపై ఎస్సై మాధవరావు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో ఎక్కడైనా అలజడులు సృష్టిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహిస్తున్నట్లు తేలితే చర్యలు తప్పవన్నారు.